ప్రజల చేతిలో
# ఆయుధం
www.ayudamdaily.com
The Common People's Voice
శనివారం | అక్టోబరు 10, 2026 | సంపుటి : 7 | సంచిక : 111 | పేజీలు : 2



## రైతుల సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- సంగెం పీఏసీఎస్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

2 లో

### సమాజంలో జర్నలిస్టుల పాత్ర

# మరువలేనిది

- రాష్ట్ర సమాచార అదనపు సంచాలకులు డీఎస్
- లయన్స్ క్లబ్ 320ఎఫ్ జిల్లా ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులకు సత్కారం



**హనుమకొండ, ఆయుధం:** సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం అని, వారి చురుకైన పాత్ర అత్యంత విలువైనదని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు డిఎస్.జగన్ అన్నారు. శుక్రవారం వరంగల్ ప్రెస్ వేదికగా లయన్స్ క్లబ్ 320ఎఫ్ జిల్లా ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టుల సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డియస్ జగన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరంగల్ లో సుదీర్ఘ కాలంగా పని చేసిన తాను జర్నలిస్టు సోదరులతో జిల్లా అభివృద్ధి పరంగా ఎన్నో సూచనలు తీసుకోవడం, వాటిని జిల్లా అధికారులకు అందచేయడం వల్ల ప్రభుత్వ కార్యక్రమాల అమలు విజయవంతమైందని తెలిపారు. దేశ ప్రజలు మెచ్చే జాతర మేడారం విజయవంతం కావడానికి జర్నలిస్టుల కృషి గొప్పదని తెలిపారు. కార్యక్రమంలో నాటి తరం, నేటి తరం జర్నలిస్టుల కలయిక గొప్ప అనుభూతిగా వర్ణించారు. సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కె. వెంకటరమణ మాట్లాడుతూ జిల్లా పౌర సంబందాల అధికారిగా చాలా కాలంగా పనిచేసిన తనకు జర్నలిస్టు సోదరులతో మమేకమైన సంబంధం వుందని, జిల్లాలో కనుమరుగైన కళా రంగ సంస్థలను ఆదుకునేందుకు కాకతీయ కళా వైభవం,శతరూప కార్యక్రమాలను నిర్వహించిన సంధర్భాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యక్రమ విజయంలో పాత్రికేయుల కృషి మరువరానిదని పేర్కొన్నారు. వరంగల్లులో ఏపిఆర్ఓ గా ప్రారంభమైన ప్రస్థానం మూడు దశాబ్దాలు కొనసాగి ఈ జిల్లాతో విడదీయరాని సంబంధం అని పేర్కొన్నారు.

సమాచార శాఖ పూర్వ జాయింట్ డైరెక్టర్ మనోహర చారి మాట్లాడుతూ.. చాలకాలం తరువాత లయన్స్ క్లబ్ కార్యక్రమం వల్ల వరంగల్ కు వచ్చే అవకాశం దక్కింది. దీనికి కారణం సీనియర్ జర్నలిస్టులు... మారతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకావాలని కోరారు.

జిల్లా లయన్స్ గవర్నర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి యేటా క్యాలండర్ ఆఫ్ ఈవెంట్స్ లో భాగంగా ప్రతి సంవత్సరం సమాజసేవలో ముందుండే జర్నలిస్టులు, వైద్యులు, ఇంజనీర్లను సత్కరించడం తమ ఆనవాయితీ అని ఈ సందర్భంగా తమ సంస్థ సభ్యులు పి.వి.మదన్ మోహన్ జర్నలిస్టు సత్కార కార్యక్రమాన్ని భుజాన వేసుకొని అరవై మంది జర్నలిస్టులతో పాటు పూర్వ డిపిఆర్వోలను భాగస్వామ్యం చేయడం మహత్తర విషయం అన్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షునిగా తన ప్రయాణం డిపిఆర్ఓలతో కొనసాగిందని గుర్తుచేశారు. కార్యక్రమ చైర్మన్ సీనియర్ జర్నలిస్టు లయన్ మదన్ మోహన్ మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాల జర్నలిజం కాలంలో అనేకమంది జర్నలిస్టులు తన పట్ల సోదర భావం ప్రకటించారని, అందుకే లయన్స్ క్లబ్ ద్వారా అందరిని కలువాలనే తలంపే ఈ కార్యక్రమం చేపట్టేలా చేసిందని, తన విలేఖరి జీవన ప్రస్థానంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు డిపిఆర్వోలతో వున్న అనుబంధం ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు, స్వంత భవనానికి స్థలం భవనానికి శ్రీకారం చుట్టిందన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఎన్నడూ లేని విధంగా వరంగల్ జిల్లాలో జిల్లా పూర్వ పౌర సంబంధాల అధికారులతో పాటు వివిధ హోదాల్లో స్థిరపడిన అధికారులను గత మూడు దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులను ఘనంగా ప్రోగ్రాం కమిటి చైర్మన్ సీనియర్ జర్నలిస్టు పి.వి.మదన్ మోహన్ అధ్యక్షతన ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో విడిజి 1 రమణా రెడ్డి, పిఆర్వో అజీత్, చీఫ్ కోఆర్డినేటర్ టి.నరేందర్, పిడిజిలు కన్నా పరుశరాములు, పొట్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు వైద్యం రాజ గోపాల్, నరహరి, పరికిపండ్ల వేణు, అవార్డు గ్రహీతలు గడ్డం కేశవమూర్తి, బిఆర్ లెనిన్, తోట సుధాకర్, కక్కెర్ల అనిల్, రాజ్ నారాయణ, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధానకార్యదర్శి బొల్లారపు సదయ్య, వెంకట రమణ, వహీద్ గుల్షన్, దయాసాగర్, రవీందర్ రావు, కెకె.క్రిష్ణ మోహన్, పెద్దీశ్, సోమ నర్సయ్య, రాజేంద్రప్రసాద్, సాయిరాం, యంసాని శ్రీనివాస్, సుదీర్ఘకాలంగా ఫోటో జర్నలిస్టు సేవలందిన సకినాల శ్యాం, దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు లయన్ పెండెం వేణుమాధవ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



### ఆడపడుచులకు ప్రత్యేకం

# బతుకమ్మ పండుగ

- మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి
- రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద
- ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు!

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రతి ఆడపడుచుకు ఎంతో ప్రత్యేకమైనదని, తెలంగాణ మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ పండుగ మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతిబింబమని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యార్థి దశ నుంచే తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. మహిళా కమిషన్ ( మిగతా 2లో.. )

### కాంగ్రెస్ తుగ్లక్ పాలనలోనే

# రైతులకు కరెంట్ కష్టాలు

- రైతు ప్రభుత్వం' కాదు, రైతుల రక్తం తాగే 'రాబందుల ప్రభుత్వం'
- కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం నరసయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ధ్వజం
- రైతుల పక్షాన బిజెపి ధర్నా, అడ్డుకున్న పోలీసులు, ఉద్రిక్తతల మధ్య నాయకుల అరెస్టులు



**వరంగల్, ఆయుధం:** అధికారంలోకి వస్తే రైతులకు స్వర్గధామం చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు అన్నదాతలను నట్టేట ముంచిందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం నరసయ్య, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం, అనాలోచిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరిగిపోయాయని మండిపడ్డారు. ప్రోగ్రాం కన్వీనర్ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి నేతృత్వంలో, కిసాన్ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు దండు కిషన్ ఆధ్వర్యంలో ఖమ్మం హైవే రోడ్డులోని తిమ్మాపురం సబ్స్టేషన్ వద్ద రైతులు, కిసాన్ మోర్చా నాయకులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి బస్వాపురం లక్ష్మీ నరసయ్య, గంట రవికుమార్, జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మార్తనేని ధర్మారావు, కొండేటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరై కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా బస్వాపురం నరసయ్య మాట్లాడుతూ, 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తామని ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు కనీసం 56 గంటలు కూడా నాణ్యమైన కరెంటు ఇవ్వలేక చేతులెత్తేసారని విమర్శించారు. కాంగ్రెస్ మార్క్ తుగ్లక్ పాలన వల్ల సకాలంలో విద్యుత్ అందక, బోర్ల కింద నీరు లేక వరి పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది 'రైతు ప్రభుత్వం' కాదు, రైతుల రక్తం తాగే 'రాబందుల ప్రభుత్వం' అని దుయ్యబట్టారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతులకు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయాలని, లేనిపక్షంలో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి అధికార (మిగతా 2లో..)





# ముగిసిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్

- 5 గంటల వరకు 97 శాతం పోలింగ్

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 97శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా 115 పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 34,889 ఓట్లలో 33,973 ఓట్లు పోలయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో 98శాతం, కరీంనగర్‌లో 97శాతం పోలింగ్ నమోదైంది. ఏ యూనియన్ విజయం సాధిస్తుందో అర్ధరాత్రికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల్లో గెలుపుపై ఈ నెల 17న అధికారిక ప్రకటన వెలువడనుంది.



# రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ను కలిసిన కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం**: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయ లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి విశ్వజ, తదితరులు ఉన్నారు.




# ఆదర్శ కాలనీ.. ఆదర్శ కుటుంబం

- నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబం

**హనుమకొండ, ఆయుధం:** 53వ డివిజన్ ఆదర్శ కాలనీలో నివసిస్తున్న పైడిపాల రమేష్ కవిత కుటుంబ సభ్యులందరూ నేత్రదానానికి తమ అంగీకార పత్రాలను శుక్రవారం హనుమకొండ జిల్లా, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ కు అందజేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు పరికిపండ్ల వేణు మాట్లాడుతూ.. దేశంలో సుమారు 12 లక్షల పైన కార్నియా అంధత్వంతో మగ్గుతున్నారు. ఈ పరిస్థితి చాలా విచారకరమైన విషయం. ఒక్కరి నేత్రదానం ఇద్దరు కార్నియా అంధత్వం గల వారికి చూపునిస్తుంది. మరణాంతరం కాల్చివేయడం, పూడ్చివేయడం చేసే ముందు నేత్రదానం చేయడం వలన ఇద్దరి కార్నియా అంధులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుంది కాబట్టి మనకు ఉపయోగపడేవి మానవ మనుగడకు తోడ్పడే నేత్రాలు మట్టిలో వృధా పోనీయకుండా దానం చేయడానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను అభినందించారు, అంతేకాకుండా గతంలోనే కవిత తన మరణానంతరం మెడికల్ కాలేజీకి శరీర దానం చేయడానికి అంగీకార పత్రాన్ని అందజేసిన గొప్ప మానవతావాది అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మరింతమంది ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. వివరాలకు 9490133650, 8790548706 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాశం సంజీవరెడ్డి, పైడిపాల రమేష్, మద్రిపెల్లి కవిత, సృజనశ్రీ, అజితేష్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.




### సహచట్టం అమలులో

# ఉత్తమ అవార్డు

- గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం**

సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అవార్డును అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి సమాచార హక్కు వారోత్సవాలు 2026 కార్యక్రమంలో ఈ అవార్డును రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అవార్డును అందుకున్నారు. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. సమాచార హక్కు చట్టం అమలులో జిల్లాకు లభించిన ఈ అవార్డు ప్రజాకేంద్రిత పాలన, పారదర్శకత, జవాబుదారితనాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ చాహత్ పాయి అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పారదర్శకమైన పరిపాలన కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పట్ల జిల్లా కలెక్టర్ కు అధికారులు, పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సస్పెండ్

- డీఈవో గిరిరాజ్ గౌడ్ ఉత్తర్వులు

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జిల్లా, వడ్డెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎల్.నరేందర్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించారని, అసభ్య పదజాలం ఉపయోగించారని, ఇతర దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని ఆయనపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందాయి. పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది జోక్యం చేసుకున్నారు. తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ సహా విద్యార్థి సంఘాలు వినతిపత్రాలు సమర్పించాయి. ఘటనను జిల్లా కలెక్టర్ సీరియస్‌గా పరిగణించి సస్పెన్షన్‌కు ఆమోదం తెలిపారు. దీంతో తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్, 1991 ప్రకారం శ్రీ ఎల్. నరేందర్ నాయక్‌ను తక్షణమే సస్పెండ్ చేశారు. క్రమశిక్షణా చర్యలు పూర్తయ్యే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని.. విద్యార్థుల భద్రత, గౌరవం, సంక్షేమమే విద్యాశాఖకు అత్యంత ప్రాధాన్యమని, ఇలాంటి ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

## కాంగ్రెస్ తుగ్లక్ పాలనలోనే

# రైతులకు కరెంట్ కష్టాలు

(మొదటి పేజీ తరువాయి..) దాహం తప్ప రైతుల సంక్షేమం పట్టదని విమర్శించారు. వరంగల్ జిల్లాలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారి, చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే పాలకులు ఏసీ రూముల్లో ఉంటూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి ఓట్లేసినందుకు ఈరోజు రైతులు రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఎండిపోయిన ప్రతి ఎకరా వరి పంటను అధికారులు తక్షణమే సర్వే చేసి, బాధిత రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల వరంగల్ జిల్లా వర్ధన్నపేట పరిసర ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, విద్యుత్ అధికారులు అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగి కరెంట్ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. రైతుల కడుపు కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు బీజేపీ కిసాన్ మోర్చా విశ్రమించబోదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిజెపి జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్లు మర్తనేని ధర్మారావు, గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ డాక్టర్ టి. రాజేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు జగన్మోహన్ రెడ్డి, దేవర శీను, రాష్ట్ర ఉపాధ్యక్షులు నూతనకంటి శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, యాదగిరిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జలగం రంజిత్ రావు, సిద్ధం నరేష్, కేశవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, అమృత రావు, బిజెపి పదాధికారులు, అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి గోల్డ్, బ్రాంజ్ మెడల్

- అభినందించిన బ్యాడ్మింటన్ అసోసియేషన్

**వరంగల్, ఆయుధం**

యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్ అండర్-15, అండర్-17 కేటగిరీ లో ఈ నెల 1 నుంచి 9 వరకు రాజస్థాన్ రాష్ట్రం లోని "జైపూర్" లో జరిగిన టోర్నమెంట్ లో వరంగల్ జిల్లాలోని "ఎస్ ఎస్ కాన్సెప్ట్ హై స్కూల్" లో 9వ తరగతి చదువుతున్న అగ్రశ్రేణి అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారుడు "సామల శ్రీచేతన్ శౌర్య" అండర్-15 బాలుర డబల్స్ లో "గోల్డ్ మెడల్, అండర్-17 బాలుర సింగిల్స్ లో బ్రాంజ్ మెడల్" సాధించాడు. చైనా లో జరిగిన ఆసియా బాడ్మింటన్ క్రీడల్లో శ్రీచేతన్ శౌర్య ఉత్తమ ప్రతిభ కనపరిచాడు. ప్రస్తుతం గోపీచంద్ అకాడమీ లో శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారుణ్ణి బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డా. రమేష్ కుమార్, సెక్రటరీ రమేష్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ గూడెపు రమేష్, నాగకిషన్, కోచెస్, అసోసియేషన్ సభ్యులు శ్రేయోభిలాషులు శ్రీచేతన్ శౌర్య ని సత్కరించి అభినందించారు.






## రంగసాయిపేటలో ఘనంగా బొడ్డెమ్మ నిమజ్జనం

**వరంగల్, ఆయుధం:** వరంగల్ రంగసాయిపేట కాపు వాడ, ఆదర్శ నగర్, కరీమాబాద్ ఉర్సు, శివనగర్, ఖిలా వరంగల్ 42వ డివిజన్ రంగసాయిపేటలో గల ఆదర్శనగర్ లో చీకటి సరోజన నివాసంలో, కటిక వాడలో, రామాలయం దగ్గర అడుప వేణు నివాసంలో, కాపు వాడలోని సుభాష్ పరపతి సంఘంలో ఏర్పాటుచేసిన బొడ్డెమ్మ నిమజ్జనం ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆడపడుచులు అందరూ ఒకచోట చేరి బొడ్డెమ్మను అలంకరించి బొడ్డెమ్మ కోలాటం పాటలు పాడుతూ బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ ఆట ఆడారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.




## అభ్యాస హై స్కూల్ లో బతుకమ్మ వేడుకలు

**వరంగల్, ఆయుధం**

వరంగల్ 43 డివిజన్ గణేష్ నగర్ లోని అభ్యాస హైస్కూల్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు జరిగాయి. స్కూల్ కరస్పాండెంట్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ హాజరై 6 ఫీట్ల బతుకమ్మను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల కొంగు బంగారం మన బతుకమ్మ విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడం పాఠశాల కర్తవ్యం అని చెప్పారు. బతుకమ్మను పేర్చడం ఒక కళా అని తీరొక్క పూలతో పూజించి ప్రతీ రంగు మనసును ఆకట్టుకునేలా అలంకరించడం ఆలోచింప చేసే ప్రయత్నం అని అన్నారు. బతుకమ్మ అందరిని సుఖసంతోషాలతో బతుకుమని దీవించమని కోరారు. స్కూల్ ప్రిన్సిపాల్ మండల శిరీష మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మను పేర్చడం పూజించడం ఒక అదృష్టంగా భావించాలని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ పిడి చీకటి సమ్మయ్య, స్కూల్ ఇంచార్జీ కోల రాము, రజినీ, భారతి, సృజన, స్రవంతి, స్వాతి, కవిత, సుమయా, రజిత, ప్రణయ్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

# ఆడపడుచులకు ప్రత్యేకం బతుకమ్మ పండుగ






(మొదటి పేజీ తరువాయి..) అధ్యక్షురాలిగా తాను అనేక సవాళ్లను అధిగమిస్తూ మహిళల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నానని నేరెళ్ల శారద తెలిపారు. నేటి సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య పెరుగుతున్న విభేదాలను పరిష్కరించేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, మహిళలు తమ హక్కులను తెలుసుకొని వాటిని సాధించుకునే దిశగా ముందుకు సాగాలని అన్నారు. బతుకమ్మ తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీక మాత్రమే కాకుండా మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు, సామాజిక సమైక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.
సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, దాడులు రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీలో రాత్రి తొమ్మిది గంటల సమయంలో జరిగిన సంఘటన మహిళల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందని అన్నారు. మహాత్మా గాంధీ పేర్కొన్నట్లు మహిళ అర్ధరాత్రి ఒంటరిగా స్వేచ్ఛగా తిరగగలిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధించినట్లు భావించగలమని గుర్తుచేస్తూ, నేటి పరిస్థితుల్లో రాత్రి తొమ్మిది గంటలకే మహిళలకు స్వేచ్ఛ, భద్రత కరువవడం విచారకరమని పేర్కొన్నారు. మహిళలకు సమాజంలోనే కాకుండా కుటుంబంలోనూ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, చివరకు కన్నతండ్రి దగ్గర కూడా ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతున్న ఘటనలు సమాజం ఎటువైపు వెళ్తోందో ఆలోచింపజేస్తున్నాయని అన్నారు. ఆడపిల్లలకు భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మహిళల పట్ల పురుషుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే సమానత్వంతో కూడిన సమాజం ఏర్పడుతుందని స్పష్టం చేశారు.
మహిళలకు విద్య, స్వేచ్ఛ, ఆత్మగౌరవం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మహిళల హక్కుల గురించి తెలుసుకోవాలని నేరెళ్ల శారద పిలుపునిచ్చారు. మహిళల హక్కులపై విస్తృత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల నుంచే ప్రారంభిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో బాలికలకు స్వీయరక్షణ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని, ప్రతి శుక్రవారం, శనివారం ఈ కార్యక్రమాలను నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.
కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. మహిళలందరూ ఒకచోట చేరి, బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతోపాటు మన సంప్రదాయాలను కాపాడేందుకు దోహదపడతాయని తెలిపారు.
కూడా చైర్మన్ గుండు సుధారాణి మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఉత్తర తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన గొప్ప విద్యాసంస్థ అని అన్నారు. ఈ కళాశాలలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు వంటి ప్రముఖులు విద్యనభ్యసించడం గర్వకారణమని పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని అన్నారు. కళాశాల శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతోపాటు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యురాలు ఆచార్య బి. రమాదేవి, డాక్టర్ అనితారెడ్డి, నాయిని నీలిమ, మహిళా కమిషన్ సభ్యులు రాధాబాయి, రమాదేవి, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుంకరి జ్యోతి, కళాశాల ఉప ప్రిన్సిపల్ ఎస్.ఎన్. రెహమాన్, అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బిక్షపతి, ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ ఆదిరెడ్డి, సహాయ రిజిస్ట్రార్ సునీల్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సుచరిత, డాక్టర్ సునీత, శ్రీలక్ష్మి, ఇతర అధ్యాపకులు, మహిళా కమిషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## భద్రకాళి ఆలయంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పూజలు

**వరంగల్, ఆయుధం: వరంగల్‌లోని శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద శుక్రవారం సందర్శించారు. ఆలయ ఈవో, అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ భద్రకాళి మాతకు పూజల అనంతరం మహాదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఆమె వెంట తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.**

## ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో

## ప్రభుత్వం కీలక మార్పులు

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. నివాస అపార్ట్‌మెంట్ల ఎత్తు పరిమితిని 18 నుంచి 24 మీటర్లకు పెంచింది. 24 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాలకు ఫైర్ టవర్ తప్పనిసరి చేసింది. బేస్‌మెంట్ లో డీజీ రూముల వెంటిలేషన్‌కు కొత్త వెసులుబాటు కల్పించింది. క్రెడాయ్, నరెడ్కో, బిల్డర్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 అక్టోబర్ 7 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఫైర్ ఎన్‌వోసీ సరళీకరణ, భవనాల్లో అగ్ని భద్రతా చర్యల అమలే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

**రఘునాథపల్లి, ఆయుధం:** రఘునాథపల్లి మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఖిలాషాపూర్ లో పీఎంశ్రీ ఆక్టివిటీస్ లో భాగంగా తెలంగాణ సంస్కృతి ప్రతిబింబింబించే విధంగా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు . పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ భారత రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో ఉత్సాహబరితంగా మంచి నైపుణ్యం కనబరిచిన విద్యార్థినులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు కళావతి, విమలదేవి, ప్రసన్నరాణి, రాధ, ఉపాధ్యాయబృందం శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ కుమార్, రమేష్, యాదవరెడ్డి, వివోఏ కాయితాల రాజమౌళి, మానస, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



## తమిళనాట టీవీకే, బెంగాల్‌లో బీజేపీ హవా

**జాతీయం, ఆయుధం:** తమిళనాడులో రెండు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో విజయ్ పార్టీ హవా కొనసాగించింది. మధురాంతకంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమారవేల్, ధారాపురంలో సత్యభామ విజయం సాధించారు. గత ఎన్నికల్లో అన్నాడీఎంకే నుంచి గెలిచి.. ఆ తర్వాత టీవీకేలో చేరిన ఈ మహిళా నేతలు తాజా ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించడం విశేషం. ఈ రెండు స్థానాల్లోనూ డీఎంకే రెండో స్థానంలో నిలవగా అన్నాడీఎంకే మూడో స్థానానికి పరిమితమైంది. పశ్చిమ బెంగాల్‌లోని రెజినగర్‌లో భాజపా అభ్యర్థి శంఖారవ్ సర్కార్, నందిగ్రామ్‌లో హసిరానీ రత్ ఘన విజయం సాధించారు. ప్రత్యర్థిపై సర్కార్ 72వేలకు పైగా మెజార్టీ సాధించగా.. లక్షకుపైగా ఓట్లతో హసిరానీ గెలుపొందారు. పుదుచ్చేరిలోని తట్టంచావడి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగ్గా.. ఆల్ ఇండియా ఎన్.ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ ఆనంద్ గెలిచారు. వీటితోపాటు అస్సాంలోని నాగావ్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార భాజపా భారీ మెజార్టీ దిశగా దూసుకెళ్తోంది.



## ప్రకృతి పట్ల కృతజ్ఞతకు ప్రతీక బతుకమ్మ

- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి

**జనగామ, ఆయుధం:** జనగామలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అధ్యక్షతన కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ వస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ చుట్టూ సంప్రదాయ నృత్యాలు, బతుకమ్మ పాటలు పాడుతూ తెలంగాణ సంస్కృతిని కళ్లకు కట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..."బతుకమ్మ అనేది కేవలం పూల పండుగ మాత్రమే కాదు. ఇది తెలంగాణ సంస్కృతికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతి పట్ల కృతజ్ఞతకు ప్రతీక. మన పూర్వీకులు అందించిన ఈ సంప్రదాయాన్ని కాపాడుకుంటూ, విద్యార్థులలో సాంస్కృతిక విలువలు, ఐక్యత, ప్రకృతి పరిరక్షణ భావాలను పెంపొందించాలి. సాంస్కృతిక గర్వంతో పాటు విద్యా నైపుణ్యాన్ని సాధించడమే మన లక్ష్యం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ వై. శ్రీకాంత్ రెడ్డి, అధ్యాపకులు రజిత, డాక్టర్ వరుధిని, నీతా, రేఖ, జ్యోతి, ప్రియదర్శిని, అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.



## ఆర్టీసీ ఎన్నికల సరళిని పరిశీలించిన

# సిపిఐ నాయకులు

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండలోని వరంగల్ 1, వరంగల్ 2, హనుమకొండ డిపోలలో జరుగుతున్న ఆర్టీసీ ఎన్నికలలో ఓట్ల సరళిని సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు పరిశీలించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి వరంగల్ లోకల్ డిపో, హనుమకొండ డిపోలలో పోలింగ్ కేంద్రాల్లో తిరిగి ఓటింగ్ నమోదును పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ కూటమి అనుబంధ సంఘం గెలుపు అత్యధిక మెజార్టీ కోసం మాత్రమే చూస్తున్నామని ఎంప్లాయిస్ యూనియన్ కూటమి నాయకులు చెప్పడం జరిగింది. ఆర్టీసీ ఎన్నికలలో ఈయూ కూటమి గెలుపు ఖాయమని అన్నారు.




## మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో

# బతుకమ్మ వేడుకలు

**హనుమకొండ, ఆయుధం:** కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విశ్వవిద్యాలయ రిజిస్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పాలక మండలి సభ్యురాలు అనిత రెడ్డి ఉత్సవాలను ప్రారంభించి పిల్లలతో బతుకమ్మ ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ అంగరంగ వైభవంగా కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ బతుకమ్మ వేడుకల్లో బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సూపరిండెంట్ వీరు నాయక్ తదితరు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రైతులకు మెరుగైన సేవలు అందించడమే సహకార సంఘాల బాధ్యత
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- సంగెం పీఏసీఎస్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**సంగెం, ఆయుధం:** సంగెం మండల కేంద్రంలోని పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) సొసైటీలో నూతనంగా నామినేటెడ్ చైర్‌పర్సన్‌గా నియమితులైన జనగాం విజయ రమేష్, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. సంగెం బస్టాండ్ నుంచి నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్‌తో పాటు కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, సహకార సంఘాలు రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు రైతులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, సంఘం అభివృద్ధికి సమష్టిగా పని చేయాలని కోరారు. వ్యవసాయ రైతుల కుటుంబాల్లో ఆనందం నింపడమే లక్ష్యంగా సొసైటీలను బలోపేతం చేస్తున్నామన్నారు. క్లస్టర్ వారిగా ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేస్తామని, కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రైతులు అందిపుచ్చుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో పీఏసీఎస్ సొసైటీల బాధ్యత ఎంతో ముఖ్యమైనదని అన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695